# 3 వర్సిటీలకు ఉప కులపతులు

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఎట్టకేలకు మూడు విశ్వవిద్యాలయాలకు ఉప కులపతులను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉస్మానియా, అంబేడ్కర్, తెలంగాణ విశ్వ విద్యాలయాలకు అన్వేషణ బృందం ముగ్గురి చొప్పున సూచించిన జాబితాల నుంచే వీరి పేర్లను ఎంపిక చేసింది. ఉస్మానియాకు ఉపకులపతిగా రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్.సత్యనారాయణ, తెలంగాణ విశ్వవిద్యాలయానికి ఉస్మానియా కామర్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్ మహమ్మద్ అక్బర్ అలీఖాన్, అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి యూజీసీ అదనపు కార్యదర్శి డాక్టర్ పి.ప్రకాష్‌లను ఖరారు చేశారు. స్థానికంగా ఉన్న ప్రాధాన్యాల ప్రాతిపదికగానే ఈ నియామకాలు జరిగినట్లు తెలుస్తోంది. ఉప కులపతుల నియామకానికి గవర్నర్ నరసింహన్ ఆమోద ముద్ర వేశారు. ఆ వెంటనే ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి గోపాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.